

హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎన్‌సి సంతోష్

# గజ్వేల్ ఘనత చాటేలా పోటీలు నిర్వహించాలి

- **సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**
- **రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే**

గజ్వేల్‌అర్బన్, డిసెంబర్ 30: గజ్వేల్ ఘనతను చాటిచెప్పేలా కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహించాలని, తమవంతు సహకారం అందిస్తామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. గజ్వేల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కరపత్రాలు, గోడప్రతులను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. జనవరి 11 నుంచి 14వ తేదీ వరకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, అధ్యక్షుడు నేతి చిన్న సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, హరీశ్‌రావును కలిశారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో 33 జిల్లాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు, 100 మంది రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు, బాధ్యులు పాల్గొంటున్నట్లు జిల్లా అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. నాలుగు రోజుల్లో 68 జట్లు, 144 మ్యాచ్‌లు సింథటిక్ మ్యాట్‌పైన, ఫ్లడ్‌లైటింగ్స్ మధ్యలో రాత్రి, పగలు క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ మహిళా కమిషన్ చైర్మన్ రాజ్యలక్ష్మి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ చైర్మన్ జుబేర్‌పాషా, ఉపాధ్యక్షుడు సంపంగి రాజు, కోశాధికారి కుంట సత్యం, సంయుక్త కార్యదర్శులు మహేశ్, శ్రీకాంత్, లింగని రాజు ఉన్నారు.

# కేసీఆర్ సర్కారులోనే గ్రామాలకు మహర్దశ

కాంగ్రెస్ ప్రభుత్వం అదే విధానాలు కొనసాగించాలి



పోతారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పంచాయతీ పాలకవర్గ సభ్యులు

- **స్వచ్ఛతలో తెలంగాణకే అత్యధిక అవార్డులు**
- **దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, డిసెంబర్ 30: కేసీఆర్ సర్కారులోనే గ్రామాలకు మహర్దశ నెలకొన్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం దుబ్బాక మండలం పోతారం గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ నూతన భవనం, రూ.15 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తమ సొంత గ్రామం పోతారంలో పంచాయతీ భవనంతోపాటు ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెట్టి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గ్రామాల్లో పంచాయతీ భవనాలతో పాటు చెత్త సేకరణకు ట్రాక్టర్లు, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల పెంపకం చేపట్టి, వాటి సంరక్షణ కోసం నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారన్నారు. వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు నిర్మించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని తెలిపారు. దుబ్బాకను అన్నిరంగాల్లో అభివృద్ధిచేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాయకులు రాజమౌళి, కిషన్ రెడ్డి, కైలాస్, కృష్ణ, శ్రీనివాస్, సిద్దిరాములు పాల్గొన్నారు.

# ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లండి

## ఎమ్మెల్యేను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి కొండా సురేఖ

- **కొమురవెల్లి జాతర ఏర్పాట్ల సమీక్షలో ప్రొటోకాల్ వివాదం**
- **అభ్యంతరం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**
- **సమావేశాన్ని బహిష్కరించిన ఎమ్మెల్యే పల్లా..**

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 30: ''అంతా మా ఇష్టం. ఇష్టముంటే ఉండండి.. లేకపోతే వెళ్లండి''.. అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అధికారిక సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎలా ఉంటారని ఎమ్మెల్యే ప్రశ్నించినందుకు మంత్రి బదులిచ్చిన తీరిది. కొమురవెల్లి మల్లన్న కల్యాణ మహోత్సవం, జాతర ఏర్పాట్లపై సిద్దిపేటలోని హరిత మినర్వా హోటల్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అధికారిక సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేగా ఓడిపోయిన ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మంత్రికి ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది. మీరు ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లండి అని మంత్రి వ్యాఖ్యానించడంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మరికొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు.

### ఆచార, సంప్రదాయాలకు వ్యతిరేకంగా సమావేశం: ఎమ్మెల్యే

కొమురవెల్లి మల్లన్న జాతరకు సంబంధించిన సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం విడ్డూరమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మల్లన్న జాతరకు తాము సహకరించినా, మల్లన్న సన్నిధిలో పెట్టాల్సిన సమావేశాన్ని ఆచారాలు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఒక కమర్షియల్ ప్రదేశంలో సమీక్షించడం తగదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రాంగణంలోనే సమావేశం నిర్వహించారన్నారు. ఓడిపోయిన నాయకులను తీసుకొచ్చి సమావేశంలో కూర్చోబెట్టడం దురదృష్టకరమన్నారు. దేవుడి సేవకులుగా తాము మల్లన్న కల్యాణం, జాతరలో పాల్గొంటామన్నారు. ప్రజలు ఎన్నుకున్న తమను ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండని మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఇగోలు, ప్రొటోకాల్ లేకుండా మల్లన్న కల్యా ణం, జాతరలో స్వచ్ఛందంగా తాము సేవ చేస్తామన్నారు. దేవాలయంలో కూడా రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తూ తాము సమావేశాన్ని బహిష్కరించామన్నారు.

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

కొమురవెల్లి మల్లన్న కల్యాణం, జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. జనవరి 7 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జరిగే మల్లన్న జాతర ఏర్పాట్లపై సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంబంధిత శాఖలు ఏర్పాట్ల కోసం ప్రతిపాదనలు పంపితే ఈసారి బడ్జెట్‌లో నిధులు కేటాయించి శాశ్వత పద్ధతిలో ఏర్పాట్లు చేస్తామన్నారు. కొమురవెల్లిలో శాశ్వత ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సూచిక బోర్డులు, అనౌన్స్‌మెంట్ మైకులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి దేవస్థానం వరకు వృద్ధులు, దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, వృద్ధులు, గర్భిణులు, పిల్లల కోసం ప్రత్యేక దర్శన క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ.. జనవరి 3వ తేదీ వరకు సంబంధిత శాఖల అధికారులతో కలిసి కొమురవెల్లి ఆలయాన్ని సందర్శించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాసరావు, పోలీస్, దేవాదాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మధ్య వాగ్వాదం




పటాన్‌చెరు: పోచారంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

- **ప్రజాపాలనతో ప్రజల వద్దకు వచ్చాం**
- **ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తాం**
- **వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

# సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

పటాన్‌చెరు, డిసెంబర్ 30: సంక్షేమం, అభివృద్ధి మా ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం పోచారంలో ప్రజాపాలనలో ఆయన పాల్గొని, ఆరు గ్యారెంటీల దరఖాస్తుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందజేసే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకొచ్చే బాధ్యత యంత్రాంగానిదేనన్నారు. దరఖాస్తులు ఇచ్చి కౌంటర్లలో రసీదు తీసుకోవాలని ప్రజలకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ సుష్మాశ్రీరెడ్డి, జడ్పీటీసీ సుప్రజారెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎంపీడీవో బన్సీలాల్, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

### అమీన్‌పూర్ బంధంకొమ్ములో..

అమీన్‌పూర్, డిసెంబర్ 30: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు బంధంకొమ్ము ప్రాథమిక పాఠశాలలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డులో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల సౌకర్యార్థం సరిపడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్ కుమార్, ఆర్‌డీవో రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

### రామచంద్రపురంలో..

రామచంద్రాపురం, డిసెంబర్ 30: అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోని విద్యుత్‌నగర్ 5వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన కౌంటర్లను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ విషయమై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ శరత్, చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, కౌన్సిలర్లు బాబ్జీ, లచ్చిరాం, శ్రీశైలం, పావనిప్రసన్న, రెడ్డి సరిత, మయూరి, మంజుల, కాట సుధారాణి, కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటశ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, శ్యాంరావు, అవినాశ్‌గౌడ్, అరుణ్‌గౌడ్, వాజిద్ పాల్గొన్నారు.